# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద రైతుల అవస్థలు

**- జొన్నలు పోసి 20 రోజులు అన్నదాతల పడిగాపులు**

**- 'తరుగు' పేరుతో క్వింటాల్‌కు 2 కిలోల నష్టం అంటున్న రైతులు**





**తొలి సమయం కొత్తగూడ 28 ఏప్రిల్ 2026**

కొత్తగూడ మండలం, మహబూబాబాద్ జిల్లా: గిరిజన సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటను కేంద్రానికి తీసుకొచ్చి ఇరవై రోజులు గడిచినా కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రైతుల వాదన ప్రకారం, 'తరుగు' పేరుతో ప్రతి క్వింటాల్‌కు సుమారు రెండు కిలోల వరకు తగ్గించి తూకం వేస్తున్నారని, దీనివల్ల తమకు గణనీయమైన ఆర్థిక నష్టం కలుగుతోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మార్కెట్ ధరలు అనిశ్చితంగా ఉండగా, ఇలాంటి కోతలు రైతులపై అదనపు భారం మోపుతున్నాయని వారు వాపోతున్నారు. అదనంగా గన్ని సంచీలు సమయానికి అందించకపోవడంతో పంటను సురక్షితంగా నిల్వ ఉంచడం కష్టసాధ్యమైందని రైతులు చెబుతున్నారు. కొనుగోలు ప్రక్రియలో "మ్యాచర్" వంటి సాంకేతిక కారణాలను చూపిస్తూ అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శిస్తున్నారు.మండుటెండలో రోజులు తరబడి కేంద్రం వద్దే వేచి ఉండాల్సి వస్తోందని, కనీస వసతులు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. త్రాగునీటి సౌకర్యం లేకపోవడం, నీడ కోసం ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడం వల్ల మహిళా రైతులు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.తక్షణమే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించి, 'తరుగు' పేరుతో జరుగుతున్న నష్టాన్ని నిలిపివేసి, గన్ని సంచీలు సమృద్ధిగా అందుబాటులో ఉంచడంతో పాటు త్రాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించాలని రైతులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# రైల్వే స్టేషన్ నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలి

**- భక్తుల కోసం షిరిడీ, తిరుపతికి రైళ్ళను నడపండి**

**- సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ సభ్యులు వై. శ్రీనివాస్ రెడ్డి**






**తొలిసమయం, కొత్తగూడెం, ఏప్రిల్ 28 :**

భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ కేంద్రంగా ఉన్న కొత్తగూడెంలోని రైల్వే స్టేషన్ పనులను తక్షణమే పూర్తి చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ డి ఆర్ యు సి సి మెంబర్ వై. శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే సంచలన్ భవన్ లో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ డి ఆర్ యు సి సి మెంబర్స్ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కొత్తగూడెం నుండి తిరుపతికి ప్రత్యేక రైలు నడుపుతామని హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదని, ఎప్పుడు ఈ రైలు నడుపుతారని అధికారులను ప్రశ్నించారు.కాజీపేట డోర్నకల్ టు మణుగూరు వరకు గతంలో నడిపిన ప్యాసింజర్ రైలును, కొలహపూర్ బెల్గావి ఎక్స్ప్రెస్ ను ఎందుకు ఆపారని ఈ ట్రైన్స్ ను తక్షణమే నడపాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ పనులు గత నాలుగు సంవత్సరాలుగా నత్త నడక నడుస్తున్నాయని, ప్రజలు ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు కొత్తగూడెం నడిబొడ్డున రాజీవ్ పార్కు, ప్రగతి మైదానం, ఎన్జీవోస్ కాలనీ మధ్యలో గత అనేక సంవత్సరాలుగా ఉన్న రైల్వే ట్రాక్ దారిని మూసివేసారని దీనివలన ప్రజలు, వాకర్స్ చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాగా తక్షణమే ఈ దారిని తిరిగి ఓపెన్ చేయాలని అధికారులకు సూచించారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్లో సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ ప్లాట్ ఫామ్ వన్ కు రాకుండా రెండవ ప్లాట్ ఫామ్ మీద ఆపుతున్నారని దీనివలన ప్రయాణికులు వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. తిరిగి సూపర్ ఫాస్ట్ ట్రైన్ నెంబర్ వన్ ప్లాట్ ఫామ్ మీదకు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు.కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్ నుండి త్రీ టౌన్ గొల్లగూడెం సెంటర్ వరకు రహదారి వెడల్పుకు పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డి అభ్యర్థన మేరకు స్థలం తక్షణం ఏర్పాటు చేసి రహదారి వెడల్పుకు క్లియరెన్స్ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా రైల్వే సమస్యలపై వినతి పత్రాన్ని సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ మేనేజర్ డాక్టర్ ఆర్. గోపాల కృష్ణన్ కి అందజేయడం జరిగింది. దీంతో అధికారులు స్పందిస్తూ సమస్యలను ఒక దాని వెంట ఒకటి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారులు డి ఆర్ యు సి సి మెంబర్స్, పాల్గొన్నారు.